సాక్షి
అనంతపురం
శనివారం । 13 । ఏప్రిల్ । 2024



చీనీ టన్ను రూ.41 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.41 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
39.9°/23.6°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. పడమటి దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

100 మీటర్ల దూరంతో మార్కింగ్



కలెక్టరేట్ నుంచి 100 మీటర్ల దూరానికి మార్కింగ్‌ను పరిశీలిస్తున్న సీఐ రెడ్డప్ప

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈ నెల 18న ప్రారంభం కానుంది. నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థుల వెంట వచ్చే వారిని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో నిలిపివేస్తారు. అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఉత్తరంగా ఆకాశవాణి కేంద్రం వైపున, తూర్పున చెరువుకట్ట వైపు, దక్షిణ దిశగా పెన్నార్ భవన్ రోడ్డువైపు 100 మీటర్ల దూరంతో మార్కింగ్ వేశారు. సర్వేయర్ ప్రతాపరెడ్డి పర్యవేక్షణలో జరిగిన మార్కింగ్ ప్రక్రియను వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప పరిశీలించారు.

ఓటరు నమోదుకు రెండు రోజులే గడువు

- 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

అనంతపురం అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటరు దేవుడు... ఓటు వజ్రాయుధం. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలి. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అయినప్పటికీ... ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకునే వీలును ఎన్నికల కమిషన్ ఈ నెల 14 వరకు కల్పించింది. ఈ ఏడాది మార్చి 31వ తేదీకి వయసు 18 ఏళ్లు నిండిన వారు, ఇప్పటి వరకు ఓటరుగా నమోదు కాని వారు దరఖాస్తు చేసుకోచ్చు. అదే విధంగా ఓటరు జాబితాలో చిరునామా మార్పునకు అవకాశం ఉంది.

అనుబంధ జాబితా రూపొందిస్తారు

ఓటరు నమోదుకు ఈ నెల 14 వరకు అందిన దరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోగా పరిష్కరించి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తారు. ఈ ఏడాది జనవరి 22న విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాకు అనుబంధ జాబితా రూపొందిస్తారు.

ఆన్‌లైన్‌లోనూ చేసుకోవచ్చు

కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలనుకుంటే... మీ ప్రాంతంలోని బూత్ లెవల్ అధికారి వద్ద దరఖాస్తు (ఫారం-6) ద్వారా నమోదు చేసుకోవచ్చు. అలా కాకున్నా ఆన్‌లైన్ ద్వారానైనా దరఖాస్తు చేసుకోవచ్చు. www.coeandhra.nic.in వెబ్‌సైట్ ద్వారా లేదా www.nsvp.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వీలు కల్పించారు.

15న మహిళా ఉద్యోగ మేళా

అనంతపురం: మొబైల్, ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలు ఈ నెల 15న కళ్యాణదుర్గం ఎకాలజీ సెంటర్లో మహిళా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత నుంచి డిగ్రీ ఉత్తీర్ణత/ ఫెయిల్ అయిన అమ్మాయిలు ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. 18 నుంచి 26 సంవత్సరాల్లోపు వయస్సు గల వారై 43 నుంచి 65 కేజీల బరువు, ఎత్తు 145 సెంటీ మీటర్లు పైబడి ఉండాలని తెలిపారు. ఉద్యోగ మేళాలో ఎంపికైన అభ్యర్థులు నర్సాపుర ఇండస్ట్రియల్ ఏరియా, కోలార్ నందలి ప్రొడక్షన్ ఆపరేటర్స్, టెక్నికల్ ఆపరేటర్స్ పని చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కళ్యాణదుర్గం ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో తమ రెజ్యూమ్‌తో హాజరు కావాల్సి ఉంటుంది.

- ఇంటర్ ఫలితాలు విడుదల • ఫస్టియర్‌లో జిల్లాకు 16వ స్థానం
- సెకండియర్‌లో 10వ స్థానంతో మెరుగుపడిన వైనం
- ఫస్టియర్‌లో 60 శాతం, సెకండియర్‌లో 78 శాతం ఉత్తీర్ణత

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో జిల్లా వ్యాప్తంగా బాలికలు పైచేయి సాధించారు. మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం రెండింటిలోనూ వారే సత్తా చాటారు. శుక్రవారం ఇంటర్ ఫలితాలు దుదలయ్యాయి. ఫస్టియర్‌లో 60 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో అనంతపురం జిల్లా 16వ స్థానంలో నిలవగా, సెకండియర్‌లో 78 శాతం ఉత్తీర్ణతతో 10వ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరంలో 21,826 మంది విద్యార్థులకు గాను 13,115 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 15,653 మంది విద్యార్థులకు గాను 12,210 మంది పాసయ్యారు.



బాలికలదే పైచేయి

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో అమ్మాయిలు అదరగొట్టారు. బాలుర కన్నా గణనీయమైన ఉత్తీర్ణత శాతం సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 11,203 మంది బాలికలకు గాను 65 శాతంతో 7,307 మంది ఉత్తీర్ణులయ్యారు. 10,623 మంది బాలురకు గాను 55 శాతంతో 5,808 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 8,464 మంది బాలికలను గాను 81 శాతంతో 6,891 మంది ఉత్తీర్ణత సాధించారు. 7,189 మంది బాలురకు గాను 74 శాతంతో 5,319 మంది ఉత్తీర్ణులయ్యారు.

- ఒకేషనల్ ఫలితాల్లోనూ బాలికలే ముందు వరసలో నిలిచారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 949 మంది బాలికలకు గాను 77 శాతంతో 735 మంది ఉత్తీర్ణులయ్యారు. 912 మంది బాలురకు గాను 39 శాతంతో 355 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 599 మంది బాలికలను గాను 90 శాతంతో 540 మంది ఉత్తీర్ణత సాధించారు. 473 మంది బాలురకు గాను 56 శాతంతో 267 మంది ఉత్తీర్ణత సాధించారు.

'రెసిడెన్షియల్' విద్యార్థుల ప్రతిభ

ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరంలో 550 మందికి గాను 83 శాతంతో 456 మంది, ద్వితీయ సంవత్సరంలో 597 మందికి గాను 87 శాతంతో 520 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో 3,053 మందికి గాను 1,168 మంది, ద్వితీయ సంవత్సరంలో 1,796 మందికి గాను 1,163 మంది ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూళ్లలో మొదటి సంవత్సరంలో 720 మందికి గాను 355 మంది, ద్వితీయ సంవత్సరంలో 644 మందికి గాను 47 మంది, కేజీబీవీల్లో మొదటి సంవత్సరంలో 692 మందికి గాను 321 మంది, ద్వితీయ సంవత్సరంలో 439 మందికి గాను 327 మంది, ఒకేషనల్ ఫలితాల్లో మొదటి సంవత్సరంలో 290 మందికి గాను 240 మంది, ద్వితీయ సంవత్సరంలో 195 మందికి గాను 185 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎయిడెడ్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో 550 మందికి గాను 456 మంది, ద్వితీయ సంవత్సరంలో 597 మందికి గాను 520 మంది ఉత్తీర్ణత సాధించారు.

మే 24 నుంచి సప్లిమెంటరీ

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 1 దాకా నిర్వహించనున్నారు. రోజూ రెండు విడతలుగా ఉంటాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. ప్రాక్టికల్ పరీక్షలు మే 1 నుంచి 4 వరకు జిల్లా కేంద్రంలో మాత్రమే నిర్వహిస్తారు. ఈ నెల 18 నుంచి 24 వరకు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్ తెలిపారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్, స్కానింగ్ కాపీ కోసం ఈ నెల 18 నుంచి 24లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సత్తాచాటిన గురుకుల విద్యాలయాలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. మొదటి సంవత్సరం పరీక్షలు 767 మంది రాయగా 666 మంది (86 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సర పరీక్షలు 820 మంది విద్యార్థులు రాయగా 748 మంది (91శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 కళాశాలలు ఉండగా మూడు కళాశాలలు 100 శాతం, నాలుగు కళాశాలలు 90 నుండి 98 శాతం ఉత్తీర్ణత సాధించాయి. సీనియర్ ఎంపీసీ లో 975 మార్కులు, జూనియర్ ఎంపీసీలో 462, జూనియర్ బైపీసీలో 434 మార్కులు సాధించారు. అనంతపురం జిల్లా కూడేరు కేజీబీవీ విద్యార్థినులు సీనియర్ బైపీసీ విభాగంలో బి.మానస 963 మార్కులు, జి.వైశాలి 957, జె.వెన్నెల 952 మార్కులు సాధించారు.



ఆవులపాటి త్రైత, కొల్లసాని అవినాష్, అనూష, కరణం యశస్విణి, కుషాల్‌సాయి ఈశ్వర్‌రెడ్డి

ఇంటర్ ఫలితాల్లో మెరుపులు

ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరుపులు మెరిపించి మార్కుల పంట పండించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో ఆవులపాటి త్రైత 991మార్కులతో జిల్లాస్థాయిలో మెరిసింది. అలాగే కొల్లసాని అవినాష్ 990 మార్కులు, చెన్నేకొత్తపల్లి మండలం నరసింగరాయనిపల్లికి చెందిన కె.అనూష 990 మార్కులు సాధించారు. భవ్యసాయి, ఎక్కలూరి మేఘన, కరణం యశస్విణి 989 మార్కులు సాధించారు. కుషాల్ సాయి ఈశ్వర్‌రెడ్డి బైపీసీ విభాగంలో 986 మార్కులు సాధించాడు.



కె.మంజునాథ్, రమ్యశ్రీ, మానస, అబ్దుల్ రకీద్ నజీర్, శృతి, కురుబ శిరీష, షేక్ షాబాజ్

జూనియర్ ఇంటర్‌లో...

జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు కె.మంజునాథ్ 467 మార్కులు సాధించాడు. షేక్ అబ్దుల్ రకీద్ నజీర్ 465 మార్కులు సాధించాడు. శృతి 464 మార్కులు సాధించింది. అలాగే బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను వజ్రకరూరు మండలం జె.రాంపురం గ్రామానికి చెందిన రమ్యశ్రీ 436 మార్కులతో సత్తా చాటింది. ఫాతిమా సుమయ 435 మార్కులు, మానస 435 మార్కులు, విజయనగరం మనోజ్ఞ 434, కురుబ శిరీష 434, సీకే షేక్ షాబాజ్ 434 మార్కులు సాధించారు.



ఫాతిమా సుమయి, విజయనగరం మనోజ్ఞ

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

అనంతపురం అర్బన్: వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ అధికమవుతున్నాయని, ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. వడగాల్పులు (హీట్ వేవ్స్), వేసవి కార్యాచరణ ప్రణాళిక, నీటి సరఫరా, తదితర అంశాలపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ రూపొందించిన పోస్టర్లను విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతిగృహాల్లో ఉంచాలన్నారు. ఆస్పత్రులు, సీహెచ్ సీల్లు, 108, 104 వాహనాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కుండలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పని ప్రదేశాల్లో షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మునిసిపాలిటీల్లో హోర్డింగ్‌లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బంది రాకూడదు

తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి నిల్వలపై నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు. నీటి వృథాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి సమస్యపై కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

12 గంటల వరకే ఉపాధి పనులు

ఉపాధి హామీ పథకం కింద పనుల కల్పనకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పనులు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే చేయించాలని ఆదేశించారు. ప్రతి పంచాయతీలోనూ ఉపాధి పనులు కచ్చితంగా జరిగేలా చూడాలన్నారు. ఉపాధి పనులు జరిగే చోట తాగునీటి సదుపాయం, కూలీలు సేద దీరేందుకు షెల్టర్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పశువుల కోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ఎన్ మూర్తి, డీపీఓ ప్రభాకర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్‌బాషా, ఎస్‌డీసీ ఆనంద్, డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు నరసింహారెడ్డి, విజయలక్ష్మి, ప్రజారోగ్య శాఖ ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, పశు సంవర్ధక శాఖ జేడీ సుబ్రమణ్యం, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఏపీఎస్పీడీసీఎల్ ఏడీ వివేకానందస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆహారం కలుషితం.. పలువురికి అస్వస్థత

- కుర్లపల్లిలో ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఘటన





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు, పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి చందు

కనగానపల్లి: దేవాలయం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆహారం కలుషితమై వంద మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన కనగానపల్లి మండలంలో చోటు చేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కుర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రాముడి గుడిని శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు మధ్యాహ్నం అక్కడే భోజనాలు చేశారు. ఆహారం తిన్న తర్వాత కొంతసేపటికి కొందరు వాంతులు, విరేచనాలు చేసుకొని అస్వస్థతకు గురయ్యారు. వారిని సమీపంలోని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత కూడా అక్కడ భోజనాలు చేసిన వారిలో చాలా మందికి ఇదే పరిస్థితి కనిపిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ధర్మవరం, మామిళ్లపల్లి, రాప్తాడు, బత్తలపల్లిలోని 108 వాహనాలన్నింటినీ హుటాహుటిన కుర్లపల్లికి పంపించారు. వీటి ద్వారా సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దాదాపు 60 మందిని ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. అలాగే ప్రైవేటు వాహనాల ద్వారా మరో 50 మంది దాకా ధర్మవరం, అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. అస్వస్థతకు గురైన వారిలో కుర్లపల్లికి చెందిన వృద్ధులు లక్ష్మిరెడ్డి, నారాయణరెడ్డితో పాటు జ్ఞానవి అనే చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచినట్లు ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

బాధితులకు పరామర్శ

ధర్మవరం: కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురై ధర్మవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి చందు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేలా వైద్యులను ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆదేశించారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం అందించాలన్నారు. వారి వెంట జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, ధర్మవరం కౌన్సిలర్లు పెనుజూరు నాగరాజు, గజ్జాల శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు చాంద్‌బాషా, ఎస్‌పీ బాషా తదితరులు ఉన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి



కంబదూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కంబదూరు: జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఆయన కంబదూరు సరిహద్దు చెక్ పోస్టును తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అక్రమ మద్యం, నగదు, డ్రగ్స్ వంటివి రవాణా జరగకుండా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద నిఘా పటిష్టం చేస్తూ అరికట్టాలని సూచించారు. తర్వాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాల గోడలపై రాసిన ఫోన్ నంబర్లకు కలెక్టర్ ఫోన్ చేయగా తహసీల్దార్ స్పందించకపోవడంతో ఆగ్రహించారు. పోలింగ్ కేంద్రాల ఆవరణలో రాజకీయ నేతల పేర్లు కలిగిన శిలాఫలకాలు కనిపించే విధంగా ఉంచడంతో అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాణీ సుస్మిత, డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐ నాగరాజు, తహసీల్దార్ నిత్యానంద బాబు, ఎంపీడీఓ సుధాకర్ రాజు, ఎస్ఐ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోండి

కళ్యాణదుర్గం: సాధారణ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కళ్యాణదుర్గం పట్టణంలోని టీ సర్కిల్‌లో ఓటు హక్కుపై కలెక్టర్ అవగాహన కల్పించారు. అనంతరం టీ సర్కిల్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు పోలీసు కవాతులో పాల్గొన్నారు. 2019 ఎన్నికల కన్నా ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం మరింత పెరగాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంను తనిఖీ చేశారు. తర్వాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (నార్తు)లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ రాణీ సుస్మిత, డీఎస్పీ బి.శ్రీనివాసులు, తహసీల్దార్ శుభకర్‌రావు, ఎంఈఓలు విజయకుమారి, బాబు, మున్సిపల్ కమిషనర్ నరసారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఈవీఎంల ర్యాండమైజేషన్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈవీఎం మేనేజ్మెంట్ నోడల్ అధికారి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల, వీవీ ప్యాట్ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ముందుగా అనంతపురం పార్లమెంట్ నియోజవర్గ స్థానానికి, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలు, వీవీప్యాట్‌లు మొదటి ర్యాండమైజేషన్ చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీ ప్యాట్లు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందన్నారు. సెక్యూరిటీ ప్రొటోకాల్ ప్రకారం పటిష్ట పోలీసు బందోబస్తుతో అసెంబ్లీ నియోజకవర్గాలకు వాటిని చేరవేస్తామన్నారు. సమావేశంలో ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎస్పీ శామ్యూల్ బెంజిమన్, ఐటీ శివ పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూం పరిశీలన

అనంతపురం: జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూంలను ఎస్పీ అమిత్ బర్దర్ పరిశీలించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. అదే విధంగా శింగనమల, అనంతపురం అర్బన్, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను భద్రపరచిన ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, జూనియర్ కళాశాల, ఎస్ఎస్‌బీఎన్ కళాశాలను సందర్శించారు. మెయిన్ స్ట్రాంగ్ రూంల నుంచి ఈవీఎంలను తరలించాక ఎలాంటి భద్రత కల్పించాలి.. స్ట్రాంగ్ రూంలకు ఎగ్జిట్, ఎంట్రెన్స్ పాయింట్లు ఎక్కడ పెడితే బాగుంటుందనే అంశంపై పలు సూచనలు చేశారు. నిరంతర బందోబస్తు చేపట్టే గార్డు పాయింటు సీసీ కెమెరాలు, తదితర అంశాలను సమీక్షించారు. ఎస్పీ వెంట ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి, త్రీటౌన్ ఎస్ఐ గోపాలుడు ఉన్నారు.

• సందడే సందడి

రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్న ముస్లింలు మరుసటి రోజు శుక్రవారం విహారయాత్రలతో సరదాగా గడిపారు. ఉదయాన్నే వంటలు సిద్ధం చేసుకుని క్యారియర్లు కట్టుకుని అవసరమైన సరంజామా తీసుకుని పిల్లాపాపలతో యాత్రకు బయల్దేరారు. అనంతపురం శివారులోని నేషనల్ పార్క్ ముస్లింలతో సందడిగా కనిపించింది. పార్క్‌లో చెట్ల కింద సేద తీరి అక్కడే వంటకాలు ఆరగించి.. కబుర్లు చెప్పుకుంటూ గడిపారు. ఊయలలు, గుర్రాలు, ఒంటెల సవారీ, బోటింగ్, జంపింగ్, జారుడుబండ, వ్యాయామ పరికరాలు తదితర వాటితో సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



నేషనల్ పార్క్ వద్ద ముస్లింల కోలాహలం

నిర్భయంగా ఓటు వేయండి



పంపనూరులో సాయుధ బలగాల కవాతులో పాల్గొన్న ఎస్పీ అమిత్ బర్దర్

ఆత్మకూరు: ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలని ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. ఏమైనా ఇబ్బందులుంటే వెంటనే పోలీసుల దృష్టికి తేవాలన్నారు. శుక్రవారం పంపనూరులో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. వీధుల్లో పోలీసు బలగాలతో కలియదిరిగారు. అనంతరం ప్రజలకు పలు సూచనలు చేశారు. స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలే తమ లక్ష్యమని తెలిపారు. ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గొడవలకు, అల్లర్లకు దూరంగా ఉండాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసులకు సూచించారు. అల్లర్లకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మునీర్ అహమ్మద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా విధులు నిర్వర్తించండి


కళ్యాణదుర్గం: సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగులు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. కళ్యాణదుర్గంలోని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సాయంత్రం ఎన్నికల స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఎస్పీ అమిత్ బర్దర్, ఆర్డీఓ రాణీసుస్మిత, డీఎస్పీ బి.శ్రీనివాసులులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఎన్నికల్లో తీసుకోవాల్సిన చర్యలపై సెక్టోరియల్, నోడల్ అధికారులు, పోలీస్, ఎన్నికల అధికారులతో మేనేజ్మెంట్ ప్లాన్‌పై చర్చించారు. ఉద్యోగులు ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంఘ సంస్కర్త యోగి వేమన

- సాంఘిక దురాచారాలపై గళమెత్తిన విశ్వకవి
- రేపటి నుంచి 4 రోజుల పాటు కటారుపల్లిలో వేమన ఉత్సవాలు


కటారుపల్లి వేమన ఆలయ ముఖద్వారం


వేమన సమాధి



వేమన శిలా విగ్రహం

గాండ్లపెంట: సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన సంఘ సంస్కర్త, విప్లవకారుడు వేమన సాహిత్యం పామరులను సైతం చైతన్యవంతులను చేసింది. నాటి సమాజంలో నెలకొన్న సమస్యలను అనేక కోణాల్లో దర్శించి లోటుపాట్లు, కుతంత్రాలు, అసమానతలు, దోపిడీలపై సరళమైన భాషలో ఎండగట్టిన మానవతావాదిగా ఆయన ఖ్యాతిగాంచారు. అంటరానితనం ఘోర అపరాధమని సాంఘిక విప్లవకారుడిగా ఎలుగెత్తి చాటారు. కులతత్త్వం, మత మౌఢ్యాన్ని నిరసించిన సంస్కారవాదిగా ఎదిగిన యోగి వేమన ఉత్సవాలు శనివారం నుంచి నాలుగు రోజుల పాటు కటారుపల్లిలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు సిద్ధమయ్యాయి.

వేమన చరిత్ర కదిపితే ఎన్నో కథలు..

వేమన చరిత్రను కదిపితే ఎన్నో కథలు పలకరిస్తాయి. చరిత్రను ఎన్నిసార్లు తవ్వినా ఆయన 'రెడ్డి' కులస్తుడని స్పష్టమైంది. తొలిసారిగా 1839లో చార్లెస్ ఫిలిఫ్ బ్రౌన్ (సి.పి.బ్రౌన్) ద్వారా వేమన పద్యాలు వెలుగు చూశాయని పరిశోధకులు నిగ్గు తేల్చారు. ఎంతో మంది సంఘ సంస్కర్తలు నేటికీ వేమన సాహిత్యాన్ని కొనియాడుతున్నారు. సాంఘిక దురాచారలను ఎండగడుతూ దాదాపు 7 వేలకు పైగా పద్యాలను ఆయన అందించారు. నేటికీ ఈ పద్యాలు లక్షల ప్రజల నోళ్లలో నానుతున్నాయి. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసి కటారుపల్లిలోని వేమన ఆలయాన్ని పునఃనిర్మించారు. పర్యాటక శాఖ పరిధిలోకి చేర్చి పున్నమి రెస్టారెంట్, విడిది గృహాలను నిర్మించారు. ఆయన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం వేమన ఆలయాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఏటా జనవరి 19న వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

రేపటి నుంచి ఉత్సవాలు..

ఏటా ఉగాది పండుగ అయిన వారం రోజుల తర్వాత విశ్వకవి యోగి వేమన ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఆలయ పీఠాధిపతుల ఆధ్వర్యంలో మహాశక్తి పూజతో ఉత్సవాలు ప్రారంభించనున్నారు. రెండో రోజు సోమవారం రాత్రి బండ్ల మెరవణి, పానక పంద్యారం, రాత్రి 9గంటలకు పాటల కచేరి ఉంటుంది. 16న మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఉట్ల తిరునాల, రాత్రికి అగ్నిసేవ, 17న బుధవారం రాత్రి 8 గంటలకు స్వామి వారి గొడుగుల మెరవనితో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాక వైఎస్సార్, కర్నూలు, నెల్లూరు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. ఈ క్రమంలో భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా నిర్వాహకులు అన్ని చర్యలూ తీసుకున్నారు.

కటారుపల్లికి చేరాలంటే..

కదిరి నుంచి రాయచోటి ప్రధాన రహదారిపై కటారుపల్లిక్రాస్‌కు చేరుకుని గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని వేమన ఆలయానికి చేరుకోవచ్చు. అలాగే రాయచోటి వైపు నుంచి వచ్చేవారు గాండ్లపెంట మీదుగా 4 కిలోమీటర్ల దూరం ప్రయాణించి కటారుపల్లి క్రాస్‌లో దిగి అక్కడి నుంచి కిలోమీటరు దూరంలోని వేమన ఆలయానికి చేరుకోవచ్చు.

క్లుప్తంగా

మద్యం రహిత ఎన్నికలే లక్ష్యం


రాయలచెరువులో ప్రజలతో మాట్లాడుతున్న సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ

యాడికి: మద్యం ప్రభావం లేని ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ తెలిపారు. యాడికి మండలంలోని 14 పంచాయతీల్లో గుర్తించిన సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ స్టేషన్లు, పోలీసు పికెట్లను శుక్రవారం సీఐ నాగార్జునరెడ్డితో కలసి ఆయన పరిశీలించారు. యాడికి, కోనుప్పలపాడు, గుడిపాడు, నిట్టూరు, వేములపాడు, వెంగన్నపల్లె, రాయలచెరువు, చందన, లక్ష్ముంపల్లి గ్రామాల్లో పర్యటించారు. అక్కడి పరిస్థితులపై స్థానికులతో ఆరా తీశారు. గ్రామాల్లో మద్యం నిల్వలు ఉంటే సెబ్ అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామ న్నారు. అల్లర్లు, గొడవలు జరగకుండా చూడాలని సీఐకు సూచించారు. పోలింగ్ బూత్‌లను సందర్శించి మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. వెంగన్నపల్లె, కోనుప్పలపాడులోని పోలీస్ పికెట్లను తనిఖీ చేశారు.

వైఎస్సార్‌సీపీతోనే బడుగుల అభ్యున్నతి


మాట్లాడుతున్న బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్

పామిడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే బడుగులు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందారని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు దేరంగుల ఉదయకిరణ్ అన్నారు. శుక్రవారం పామిడికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల పక్షపాతిగా పేర్కొంటూ అధికారం దక్కించుకున్న నారా చంద్రబాబు వాస్తవానికి బీసీలకు చేసిన మేలు ఏదీ లేదన్నారు. రాష్ట్రంలో బీసీల అభ్యునతికి పాటుపడింది కేవలం సీఎం వైఎస్ జగన్ ఒక్కరేనన్నారు. గుర్తింపు లేనివాళ్లకు సైతం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అగ్రపీఠం వేసిన మహానుభావుడు సీఎం జగన్ అని కొనియాడారు. సీఎం జగన్ ఓ రాజకీయ నాయకుడిగా కాకుండా సంఘ సంస్కర్తగా చూడాలని, విప్లవాత్మక నిర్ణయాలతో సమ సమాజ స్థాపన నెలకొల్పే దిశగా పాలన అందించిన ఆయనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు.

విడిపోయిన దంపతులు ఒక్కటయ్యారు


ఒక్కటైన దంపతులతో న్యాయవాదులు

హిందూపురం అర్బన్: ఇద్దరూ ప్రభుత్యోగులే అయినా వివాహమైన కొంత కాలానికే విభేదాలు చోటు చేసుకుని వేర్వేరుగా జీవనం సాగిస్తున్నారు. ఆ తర్వాత భార్య కావాలని భర్త, తనకు భర్త నుంచి విడాకులు కావాలంటూ కోర్టును ఆశ్రయించారు. చివరకు న్యాయవాదులు, కుటుంబసభ్యుల కౌన్సెలింగ్‌తో మనసు మార్చుకుని ఇద్దరూ ఒక్కటయ్యారు. వివరాలు... హిందూపురం మండలం చౌళూరు గ్రామానికి చెందిన నేత్రావతి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. ఆమెకు చిలమత్తూరు మండలం కొడికొండకు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ జీపీ సూరితో కుటుంబ పెద్దలు పెళ్లి నిశ్చయం చేసి 2020, జూన్ 10న వేడుకగా వివాహం జరిపించారు. కొంత కాలం సజావుగా సాగిన వీరి సంసారంలో తర్వాత విభేదాలు చోటు చేసుకున్నాయి. దీంతో నేత్రావతి పుట్టింటికి చేరుకుంది. సూరి సైతం చెన్నైలోని తన బెటాలియన్‌లో విధుల్లోకి చేరి పోయారు. ఆ తర్వాత విడాకులు కోరుతూ భార్య కోర్టులో పిటీషన్ దాఖలు చేయడంతో తనకు భార్య కావాలంటూ భర్త సైతం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో ఇద్దరూ క్రమం తప్పకుండా వాయిదాలకు హాజరవుతూ వచ్చారు. ఆ సమయంలో ఇద్దరూ కలసి మాట్లాడుకుంటూ ఒకరి గురించి మరొకరు పూర్తిగా అర్థం చేసుకున్నారు. ఈ క్రమంలోనే న్యాయవాదులు, కుటుంబసభ్యులు నచ్చచెప్పడంతో ఇద్దరూ ఒక్కటయ్యేందుకు అంగీకరించారు. దీంతో శుక్రవారం ఉదయం ఇందిరా పార్కులోని గణేష్ విగ్రహం ఎదుట న్యాయవాదులు, కుటుంబసభ్యుల సమక్షంలో ఇద్దరూ పూల దండలు మార్చుకుని ఇకపై సఖ్యతగా ఉంటామని ప్రమాణం చేశారు. దంపతులు ఒక్కటవ్వడంతో న్యాయవాదులు, ఇరువైపులా కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థి


విద్యార్థిని అప్పగిస్తున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి

నార్పల: మండలంలోని కేసేపల్లిలో ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్ నుంచి తప్పించుకుని పోయిన విద్యార్థి ఆచూకీని పోలీసులు పసిగట్టి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలను ఎస్ఐ రాజశేఖరరెడ్డి శుక్రవారం వెల్లడించారు. గుత్తి మండలం తొండపాడు గ్రామానికి చెందిన హరికృష్ణ కుమారుడు రేవంత్‌కుమార్ కేసేపల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఉగాది పండగకు సెలవులు కావడంతో గత శనివారం ఉపాధ్యాయులకు తెలిపి స్వగ్రామానికని రేవంత్‌కుమార్ బయలుదేరాడు. సెలవులు ముగిసిన పాఠశాలకు రాకపోవడంతో బుధవారం ఉదయం యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసింది. తమ కుమారుడు ఇంటికే రాలేదంటూ తల్లిదండ్రులు తెలిపి, వెంటనే పాఠశాలకు చేరుకుని ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో కలసి అదే రోజు నార్పల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో యాడికిలోని అగాపే చర్చిలో ఉన్నట్లుగా తెలుసుకుని శుక్రవారం ఉదయం స్టేషన్‌కు పిలచుకువచ్చి తండ్రికి అప్పగించారు. విద్యార్థి పట్ల అశ్రద్ధ వహించిన పాఠశాల ఉపాధ్యాయులపై ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

2,380 చీరలు సీజ్

డి.హీరేహాళ్ (బొమ్మనహాళ్): డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద 2,380 చీరలను అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు ఎస్ఐ గురు ప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో గుంతకల్లు నుంచి కర్ణాటకలోని హసన్‌కు వెళుతున్న బొలెరో పికప్ వాహనంలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా చీరలు తరలిస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో చెక్‌పోస్టు పోలీసులు వాహనంతో పాటు 2,380 చీరలను సీజ్ చేశారు.

ఆ ఎగ్జామినర్లను తప్పించారు

- ఎగ్జామినర్ల నియమాకాల్లో నిబంధనల ఉల్లంఘనపై విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్) ఇంటర్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) కోసం నియమితులైన ఎగ్జామినర్లను ఆ విధుల నుంచి తప్పించారు. శుక్రవారం అనంతపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల కళాశాలలో మూల్యాంకన ప్రక్రియ ప్రారంభమైంది. ఆయా సబ్జెక్టుల్లో కనీసం మూడేళ్ల అనుభం ఉన్న వారిని మాత్రమే ఎగ్జామినర్లుగా ఏర్పాటు చేయాలనే నిబంధనను పాటించకపోవడాన్ని 'ఎగ్జామినర్ల నియామకాల్లో నిబంధనలకు పాతర' శీర్షికతో ఈ నెల 12న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్, ఓపెన్ స్కూల్ డైరెక్టర్ నాగేశ్వరరావు, ఆర్జేడీ రాఘవరెడ్డి స్పందించారు. అనంతపురంలో ఏమి జరుగుతోందని కమిషనర్ ఆరా తీశారు. ఓపెన్ స్కూల్ డైరెక్టర్, ఆర్జేడీ స్వయంగా డీఈఓ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్‌కు ఫోన్లు చేశారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసినా... వారికి బోధనానుభవం ఉండాలి కదా? అని ప్రశ్నించారు. పొరపాటున కొందరి పేర్లు జాబితాలో ఉన్నాయని అలాంటి వారిని ఈ నెల 8వ తేదీనే తప్పించామంటూ జిల్లా అధికారులు వివరణ ఇచ్చారు. వాస్తవానికి కామర్స్ సబ్జెక్టుకు గార్లదిన్నె, బీకేఎస్, శింగనమల మండలాలకు చెందిన హిందీ, ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లను నియమించారు. వీరికి సంబంధిత సబ్జెక్టులో ఎలాంటి బోధనానుభవం లేదు. వీరిని ఆయా స్కూళ్లలో రిలీవ్ కూడా చేశారు. 'సాక్షి' ఆరా తీయడంతో అప్రమత్తమైన అధికారులు గురువారం సాయంత్రం ఆయా హెచ్ఎంలకు ఫోన్లు చేసి వారిని రిలీవ్ చేయొద్దని ఆదేశించారు. అప్పటికే రిలీవ్ అయిన వారి నుంచి ఉత్తర్వులు వెనక్కు తీసుకోవాలని చెప్పడంతో ఆయా టీచర్ల నుంచి రిలీవ్ లెటర్లు వెనక్కు తీసుకున్నారు. విద్యాశాఖ అధికారులు చెబుతున్నట్లు 8వ తేదీనే వారిని తొలగించి ఉంటే 11న హెచ్ఎంలు ఎలా రిలీవ్ చేశారనేది అధికారులకే తెలియాలి.

టీడీపీ నాయకుల విందులో అటెండర్


జేసీతో కలసి విందులో పాల్గొన్న అటెండర్ మాబూసాహెబ్ (వృత్తంలోని వ్యక్తి)

తాడిపత్రి రూరల్: స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న మాబూసాహెబ్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. ఇటీవల ఆర్డీటీ కాలనీలో నివాసముంటున్న టీడీపీ నేత రమణ ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి, పలువురు టీడీపీ నాయకులతో కలసి మాబూసాహెబ్ పాల్గొన్నారు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన కొందరు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.

అక్రమంగా కల్లు విక్రయిస్తున్న టీడీపీ నేత అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా కల్లు విక్రయిస్తున్న ఆ గ్రామ టీడీపీ నేత జయరాంను శుక్రవారం ఉదయం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు అరెస్ట్ చేశారు. 70 లీటర్ల కల్లు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు. అలాగే కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది – బోరంపల్లి మార్గం మధ్యలో శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 480 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు సీజ్ చేశారు. మద్యం తరలిస్తున్న ఒంటిమిద్ది నివాసి గంగాధర్‌ను అరెస్ట్ చేశారు. కాగా, గంగాధర్‌పై పదుల సంఖ్యలో ఇప్పటికే అక్రమ మద్యం కేసులు ఉండడం గమనార్హం. తనిఖీల్లో సెబ్ సీఐ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.లక్ష నగదు సీజ్

అనంతపురం: ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా తీసుకెళుతున్న రూ.లక్ష నగదును అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన నగదును అనంతపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. డీఎస్పీ వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం నాల్గో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ ఆర్.ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ నాగమధు, సిబ్బంది రుద్రంపేట సర్వీసు రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ధర్మవరానికి చెందిన గుర్రం శివ కుమార్ రూ.లక్ష నగదును ఎలాంటి ఆధారాలు లేకుండా కారులో తీసుకెళ్తుండగా గుర్తించి సీజ్ చేశారు.

'డ్రిప్' దొంగల అరెస్ట్

పెద్దపప్పూరు: రైతులు భూముల్లో ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలను అపహరించుకెళ్లే ఇద్దరు రెడ్ హ్యాండెడ్‌గా పోలీసులకు పట్టుబడ్డారు. వివరాలు... పెద్దపప్పూరు మండలం తురకపల్లికి చెందిన దివాకర్‌రెడ్డి, ఖాజాపీరా (బొలెరో యజమాని) శుక్రవారం బొలెరోలో డ్రిప్ పైపులు తరలిస్తుండగా చెర్లోపల్లి సమీపంలో పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఆ సమయంలో ఇద్దరూ తడబడడంతో తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. చెర్లోపల్లికి చెందిన రైతులు వెంకట్రామిరెడ్డి, శివశంకరరెడ్డి పొలాల్లో ఉన్న రూ.1.20 లక్షల విలువ చేసే డ్రిప్ పైప్‌లను చోరీ చేసి తరలిస్తున్నట్లుగా అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు.

అరటి తోట దగ్ధం


మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

పెద్దవప్పూరు: మండలంలోని ముచ్చుకోటలో శుక్రవారం సాయంత్రం అరటి తోట దగ్ధమైంది. వివరాలు... బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన అన్నదమ్ములు బాషా, వలి రెండేళ్ల క్రితం ముచ్చుకోటలో భూమి కొనుగోలు చేసి అరటి సాగు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం ఉన్నఫళంగా అరటి తోటలో మంటలు వ్యాపించాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న బాధిత రైతులు వెంటనే సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేసింది. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శరత్‌చంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చీర కట్టానమ్మా.. మాడొద్దు దానిమ్మా


దానిమ్మ చెట్లకు చీరలను కప్పి కాయలకు రక్షణ ఏర్పాటు చేసుకున్న దృశ్యం

పుట్లూరు: చెట్టు చెట్టుకో చీర కట్టి భానుడి నుంచి పండ్ల తోటలను రక్షించుకుంటున్నారు రైతన్నలు. అరటి రైతులు ఇప్పటికే అరటి మొక్కలను రక్షించుకోవడానికి ఈత ఆకులు, న్యూస్ పేపర్లను రక్షణగా ఉంచడం చూశాం. అయితే, అందుకు భిన్నంగా దానిమ్మ కాయలను ఎండ నుంచి రక్షించుకోవడానికి పుట్లూరు మండలం కందికాపుల గ్రామానికి చెందిన కె.రంగనాయకులు అనే రైతు చెట్లకు చీరలు చుట్టారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 800 దానిమ్మ చెట్లను చీరలతో కప్పేశారు. రంగనాయకులు రెండు ఎకరాల్లో దానిమ్మ పంటను మూడేళ్లుగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట బాగా ఉన్న సమయంలో ఎండ వేడికి కాయలు నల్లగా మారడం, కాయలోని విత్తనాలు దెబ్బతినడాన్ని గమనించారు. దీంతో ఆయన ఒక్కో చీర రూ.20 ప్రకారం కొనుగోలు చేసి ప్రతి చెట్టుకు కప్పి కాయలకు రక్షణ ఏర్పాటు చేశారు. దీంతో కాయలు నాణ్యతగా ఉంటాయనే ఆశ ఉందని ఆ రైతు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎండ నుంచి రక్షణగా



మండుటెండలు మనుషులనే కాదు పంటనూ దెబ్బతీస్తున్నాయి. ఈ క్రమంలో పొలంలో నాటిన అరటి పిలకలను కాపాడుకునేందుకు రైతులు వినూత్న చర్యలు చేపడుతున్నారు. అనంతపురం రూరల్ పరిధిలోని సోములదొడ్డికి చెందిన రైతు ఆదినారాయణరెడ్డి ఇటీవల తన పొలంలో అరటి పిలకలు నాటారు. ఎండ వేడిమి నుంచి పిలకలకు రక్షణకు కల్పించేందుకు పాతదినపత్రికలతో గుడారాలను ఏర్పాటు చేశాడు. అలాగే నాగిరెడ్డిపల్లికి చెందిన రైతు మురళీమోహన్‌రెడ్డి సైతం తాను నాటిన అరటి పిలకలకు రక్షణగా ఈత ఆకులను గుడిసెలా ఏర్పాటు చేశాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



బాబూ.. మాయమాటలు కట్టిపెట్టు



వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: మోసం చేయడమే చంద్రబాబు నైజం. ఆచరణకు నోచుకోని హామీలు ఇవ్వడం ఇకనైనా మానుకోవాలి. మాయమాటలు కట్టిపెట్టాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఏ.నారాయణపురం పంచాయతీ పరిధిలోని తపోవనంలో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూజజ 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచామన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమం అందించామన్నారు. కరోనా కష్టకాలంలో సైతం సంక్షేమ పథకాలు అందించి ప్రజలకు అండగా నిలిచామన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ముగింటకే పాలన తీసుకొచ్చామన్నారు. మాట ఇస్తే కట్టుబడే నైజం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 2014 ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రజలను ఏవిధంగా మోసం చేశారో అందరికీ తెలుసన్నారు. అధికారం కోసం రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టిన ఘనుడు చంద్రబాబు అన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి వలంటీర్ వ్యవస్థను అవమానించిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తాముఅధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగించి వేతనాలు పెంచుతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారం కోసం ఎన్ని మాయమాటలు చెప్పడానికైనా వెనుకాడరని అర్థమవుతుందన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు చేసిన అరాచకాలను ప్రజలు ఇంకా మరచిపోలేదన్నారు. చంద్రబాబు, జనసేన, బీజేపీ నాయకులు చెప్పే అబద్ధపు హామీలను నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలదే పెత్తనమన్నారు. తాము అధికారంలో ఉన్నా గత ఐదు సంవత్సరాల నుంచి ప్రజల మధ్యలో ఉన్నామన్నారు. ప్రజల మద్దతు కోల్పోయిన చంద్రబాబు వ్యాపార వేత్తలకు, బడాబాబులకు టికెట్లు కేటాయించి డబ్బులతో ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు ఎన్ని గిమ్మిక్కులు చేసినా ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ బాలాజీ, రుద్రంపేట ఉప సర్పంచ్ నరేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, రూరల్ మండల కన్వీనర్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణుగోపాల్, రాయల్ మనోజ్‌కుమార్, ఉమ్మడి జగన్‌మోహన్‌రెడ్డి, సత్యన్న పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. అండగా నిలవండి





చెన్నేకొత్తపల్లి: వెల్దుర్తిలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రాప్తాడు: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

• ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేశాం.. ఈ ఎన్నికల్లో అండగా నిలవాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని వెల్దుర్తి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో రోడ్‌షో నిర్వహించారు. అనంతరం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామిలను నెరవేర్చిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మాట ఇస్తే వెనకడుగు వేయకుండా అమలు చేస్తారన్నారు. గత ఎన్నికల్లో తనపై నమ్మకంతో గెలిపించారని.. ఈ ఎన్నికల్లో కూడా ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే జగనన్నతోనే సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందేలా చేస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఎక్కడా అవినీతి జరగకుండా సంక్షేమ పథకాల సొమ్ము నేరుగా అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నట్లు వెల్లడించారు. గతంలో ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం సచివాలయాల్లోనే పనులు జరుగుతున్నాయన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకురాలు గంగుల భానుమతి, సానే రాజారెడ్డి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, ఎంపీపీ అంజలి, సొసైటీ అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ నర్సిరెడ్డి, నరసింహారెడ్డి, సర్పంచ్ జీవితా కేశవరెడ్డి, చెన్నారెడ్డి, కొండారెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆదినారాయణ, రెడ్డప్ప రెడ్డి, మధుసూదనరెడ్డితో పాటు పలువురు పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

రాప్తాడు: మండలంలోని పాలచెర్ల గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పాలచెర్లకు చెందిన 8వ వార్డు మెంబర్ దేవర ఎర్రిస్వామి, చిట్రా బాలరాజు, బంగారు ముత్యాలు, బంగారు మూర్తి, చెరుకూరి నాగేంద్ర, కురుబ రంజిత్, పవన్ కుమార్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మేకలు, గొర్రెల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహాగౌడ్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, చిట్రా వెంకటేష్, మాజీ సర్పంచులు సదానంద రెడ్డి, బండి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బిల్లే అభిలాష, మదుసూధన్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, చిట్రా లక్ష్మీనారాయణ, లింగమయ్య, ఎర్రిస్వామి, సుమన్, పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

రాప్తాడురూరల్: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార జోరు పెంచింది. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి, ఇటుకలపల్లి, పూలకుంట, చియ్యేడు గ్రామాల్లో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకురాలు గంగుల భానుమతితో కలిసి ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యేకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. గజమాలలతో స్వాగతం పలికారు. డీజే సౌండులు, టపాసులు పేల్చుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో వాలంటీర్లను కించపరిచేలా మాట్లాడిన చంద్రబాబు ఈరోజు వారికి రూ.10 వేలు వేతనం ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతి ఇంటికీ పథకాలు అందాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. 25 ఏళ్లు అధికారంలో ఉండి ఏమి చేయలేకపోయిన పరిటాల కుటుంబానికి ఓట్లు అడగడానికి కూడా సిగ్గుగా ఉందన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

ఉప్పరపల్లిలో 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వీరికి కండువాలు వేసి ఆహ్వానించారు. దాసరి రాము, పిన్నదరి నాగేంద్ర, పిన్నదరి నాగరాజు, నరేష్, ఇల్లూరు ఈశ్వరయ్య, రమణయ్య, వెంకట, ఆజమ్, కుళ్లాయప్ప, మంజు, కొండ, శ్రీకాంత్, శ్రావణ్‌కుమార్, రాము, హేమంత్, నరసింహమూర్తి, రమేష్, నరసింహ, హరికృష్ణ, శ్రీరాములు, నరసింహులు, నాగరాజు, రామాంజి, లక్ష్మన్న, కృష్ణంరాజు, అంజి, భీమా, ముసలయ్య, చంద్రమోహన్, నారాయణస్వామి, సూరప్ప తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రి శ్రీనివాసలు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, వైస్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ చంద్ర, పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, గృహసారథులు పాల్గొన్నారు.

చంద్రబాబువి మోసపూరిత హామీలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: అధికారం కోసం చంద్రబాబు నాయుడు, టీడీపీ నాయకులు ఎంతకైనా దిగజారుతారు. 2014లో అమలు కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం ఆత్మకూరులోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారంలో ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నారని తెలిపారు. సామాన్య ప్రజలకు టీడీపీ కండువాలు వేసి రాజకీయరంగు పూస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన వారిని ప్రలోభాలకు గురి చేసి, మళ్లీ టీడీపీ కండువాలు వేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ఇచ్చే సూపర్ సిక్స్ హామీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. గతంలో వలంటీర్లను తిట్టిన చంద్రబాబు.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటిస్తారని ప్రశ్నించారు. మండలంలో టీడీపీ నాయకులు రౌడీషీటర్లు, కేసులు ఉన్న వ్యక్తులతో ప్రచారం చేయిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్ రెడ్డి, కన్వీనర్ లక్ష్మీ నరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు వాసుదేవరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మల్లన్న, పడిగిరెడ్డి, అంజినప్ప, విశ్వనాథ్‌రెడ్డి, సద్దికూటి శివారెడ్డి, చెన్నారెడ్డి, మహేష్, దామోదర్‌రెడ్డి, శ్రీరామ్, టీబీ టైలర్ వెంకటేష్, ఉజ్జినప్ప, మహేష్ నాయక్, వెంకటేష్, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం

ఆత్మకూరులో శనివారం ఎన్నికల ప్రచారం ఉంటుందని మండల నాయకులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రచారం చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తప్పక రావాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

రేపు విషు పర్వదిన వేడుకలు



నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: పాతూరు చెరువుకట్టపై వెలసి శ్రీసాయి అయ్యప్ప సేవా సమాజంలో ఈనెల 14న విషు పర్వదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతమ్ శుక్రవారం తెలిపారు. శనివారం రాత్రి ఆనవాయితీగా అయ్యప్ప భక్తులు ఆలయంలో నిద్రించి ఆదివారం తెల్లవారుజామున మొదటిగా అయ్యప్ప స్వామిని చూసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వారందరికి స్వామివారి కానుకగా రూపాయి నాణేలు అందిస్తామన్నారు. అలాగే ఆలయంలో వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా శుద్ధమైన మంచి నీరును అందించడానికి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు.

శిల్పారామంలో రంజాన్ సంబరాలు



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

అనంతపురం రూరల్: శిల్పారామంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఏఓ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మానస నృత్య కళాకేంద్రం (ధర్మవరం) శిష్య బృందం పలు సినీ గీతాలకు చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రజలను ఉల్లాస పరచాలన్న ఉద్దేశంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టామన్నారు.

గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే చర్యలు

కనగానపల్లి: రాజకీయ, వర్గ వైషమ్యాలతో గ్రామాల్లో గొడవలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుటామని రామగిరి సీఐ శివాంజనేయులు హెచ్చరించారు. మండలంలోని కోనాపురం, కనగానపల్లి గ్రామాల్లో శుక్రవారం కనగానపల్లి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఎస్ఎఫ్ దళాలతో కలసి పోలీస్ కవాతు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. గ్రామాల్లో రాజకీయ కక్షలు ప్రేరేపించి, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీధి బాలలు స్వేచ్ఛగా జీవించేలా చేద్దాం



శాంతి ర్యాలీలో పాల్గొన్న బాలలు

అనంతపురం కల్చరల్: వీధి బాలలు స్వేచ్ఛగా జీవించేందుకు అందరం సహకారం అందిద్దామని సీఆర్‌డీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సద్దాం హుస్సేన్ అన్నారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం స్థానిక లక్ష్మీనగర్‌లోని క్రీసెంట్ రెయిన్‌బో హోమ్ అనాథ చిన్నారులతో కలిసి శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెయిన్‌బో హోమ్‌ఇన్‌చార్జి శ్రావణి, మేనేజర్ పుష్పలత, రేష్మా, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

28న ఉచిత ఖత్నా

అనంతపురం కల్చరల్: జాతీయ బహుళార్థక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28న ఉచిత ఖత్నా (ఒడుగులు) కార్యక్రమం నిర్వహిస్తున్నామని సంఘం చైర్మన్ డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్, హఫీజ్ సద్దాం హుస్సేన్ శుక్రవారం తెలిపారు. ఖత్నా చేయించుకోవడం ద్వారా అనేక రోగాల బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. ముఖ్యంగా హెచ్ఐవీ, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులు దరి చేరవన్నారు. వివరాలకు 94400 63212 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రేపు హాస్యవల్లరి

అనంతపురం కల్చరల్: ఈనెల 14న వివేకానంద యోగా కేంద్రంలో హాస్యవల్లరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీనియర్ రచయిత తరిమెల అమరనాథ రెడ్డి, యోగా కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి తెలిపారు. వివేకానంద యోగా కేంద్రం, లలిత కళాపరిషత్తు, హాస్యభారతి సంస్థలు సంయుక్తంగా నిర్వహించే హాస్యవల్లరి ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.

వలంటీర్ సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై చర్యల్లో భాగంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్ కుమార్ శుక్రవారం ఒక వలంటీర్‌ను సస్పెండ్ చేశారు. అనంతపురం నగర పరిధిలోని క్లస్టర్-5 శారదానగర్ వార్డు వలంటీరు వన్నిలి ఫిరోజ్ సస్పెన్షన్‌కు గురయ్యారు.

సంక్షిప్త సమాచారం

ఇక ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు ఇప్పటి వరకు రూ.2.38 కోట్లు నగదు సీజ్ చేశాయి. అదే క్రమంలో ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా రూ.12.47 లక్షలు విలువ చేసే 7,696 లీటర్ల మద్యం సీజ్ చేశారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న డాక్టర్ సబిహా సుల్తానా

ఆత్మకూరు: ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉంది. ముఖ్యంగా గర్భవతులు వడదెబ్బ తగలకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సబిహా సుల్తానా సూచించారు. శుక్రవారం మండలంలోని బి.యాలేరు గ్రామంలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వడదెబ్బ తగిలితే చేయాల్సిన ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. వేసవిలో తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా

రాప్తాడు/ఆత్మకూరు/చెన్నేకొత్తపల్లి: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. రాప్తాడు, ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లిలోని కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచారు.



అక్షయ్ సాగర్ 954 మార్కులు, రాప్తాడు



మైత్రి, 952 మార్కులు రాప్తాడు



అంగేశ్వర్ కుమార్ 952, ఆత్మకూరు



హరిణి 495 మార్కులు, రాప్తాడు



హర్షిత, 431మార్కులు రాప్తాడు



ప్రత్యూష, 423 మార్కులు, రాప్తాడు



సింధు, 971 మార్కులు ఆత్మకూరు



సౌమ్యలక్ష్మి, 958 మార్కులు ఆత్మకూరు



పి.హేమావతి 937, ఆత్మకూరు



హెచ్.క్రాంతి 470, ఆత్మకూరు



యోషిత 464, ఆత్మకూరు



రూప 463, ఆత్మకూరు



ప్రణీత 946, రాప్తాడు



సునీతమ్మ 929, రాప్తాడు

క్విజ్ పోటీల్లో మెడికోల ప్రతిభ



వైద్య విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు

అనంతపురం మెడికల్: రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించడంలో ప్రతిభ చూపిన వైద్య విద్యార్థులు హర్షిత, నవీన్, మౌనికలను శుక్రవారం వైద్య కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్య రావు అభినందించారు. రూ.6000 నగదు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రిన్సిపల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు మాట్లాడుతూ.. జాతీయ సామాజిక వైద్య శాస్త్ర విభాగపు శాఖ ఆధ్వర్యంలో ఇటీవల క్విజ్ పోటీలను నిర్వహించారన్నారు. చదువుతో పాటు క్విజ్, క్రీడా పోటీల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక వైద్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తెలుగు మధుసూదన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నిహారిక, డాక్టర్ సుష్మ, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో షార్ట్ సర్క్యూట్

• నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో శుక్రవారం కరెంటు సరఫరా ఆగిపోయింది. దీంతో వైద్య కళాశాలలోని ఆఫీస్ బ్లాక్, లైబ్రరీ తదితర విభాగాల్లో కరెంటు సరఫరా ఆగిపోవడంతో వైద్యులు, సిబ్బంది ఇబ్బంది పడ్డారు. మూడు నుంచి నాలుగు గంటల పాటు ఇన్వర్టర్‌తో పనులు జరిగినా ఆ తర్వాత కరెంటు లేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇదే విషయమై ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్య రావును సంప్రదించగా.. షార్ట్ సర్క్యూట్‌తో కరెంటు సరఫరా ఆగిపోయిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్య తలెత్తకుండా జనరేటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి హజ్ యాత్రికులకు శిక్షణ

అనంతపురం కల్చరల్: జిల్లా నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులకు ఆదివారం నుంచి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు హాజీ ఖాదిమ్ మహమ్మద్ రఫీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోవూరు నగర్‌లో (డోర్ నం .6-2-282) విశ్వభారతి స్కూల్ సమీపంలోని ఖాదర్ మొహియుద్దీన్ సాబ్ ఇంటి ప్రాంగణంలో తరగతులుంటాయని పేర్కొన్నారు. హాజీలకు భోజన సౌకర్యం, మహిళలకు పర్దా వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు వచ్చిన వారందరికీ విధి విధానాలపై పుస్తకాలు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9440983090, 9848504735 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 14వ డివిజన్‌లో శనివారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్‌లోని సున్నపువీధి రామస్వామి గుడి నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

వైభవంగా సల్లాపురమ్మ పార్వేట



పూజలందుకున్న సల్లాపురమ్మ దేవత

రాప్తాడు: మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో సల్లాపురమ్మ జాతర (పార్వేట)ను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉగాది పండుగ తర్వాత నాలుగు రోజుల పాటు గ్రామస్తులు సల్లాపురమ్మ పార్వేటను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సల్లాపురమ్మ దేవతను గ్రామంలోకి తీసుకెళ్లి అక్కడ ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి గ్రామంలో అమ్మవారికి గ్రామస్తులు మేకలు, గొర్రెలు, పొట్టేళ్లు, కోళ్లను బలి ఇచ్చారు. సాయంత్రం అమ్మవారిని చెరువు దగ్గర వున్న సల్లాపురమ్మ ఆలయం వద్దకు డప్పు వాయిద్యాలతో తీసుకెళ్లి పూజలు చేశారు. భక్తులు గుడి చుట్టూ పన్నారపు పండ్లు తిప్పుతూ సందడి చేశారు. సాయంత్రం ఆలయం దగ్గర వేటకు వెళ్లి తెచ్చిన కుందేళ్లను వదిలి వాటిని వేటాడి చంపారు. ఇలా చేయడం వలన గ్రామానికి శాంతి జరుగుతుందని గ్రామస్తుల నమ్మకం. యువకులు టెంకాయలు, చీనీకాయలు, నిమ్మకాయలను విసరడం లాంటి పందేలు ఆడారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మునిస్వామి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

భూసార సంరక్షణతో లాభసాటి వ్యవసాయం



సర్టిఫికెట్లు అందజేస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ రోజా పుష్పలత

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయం లాభసాటిగా మారడంలో భూసార సంరక్షణ ప్రధాన పాత్ర పోషిస్తోందని జేడీఏ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా మట్టి పరీక్షలు చేయించుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. పది రోజుల ప్రాజెక్టువర్క్‌లో భాగంగా ఎస్కేయూలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న 11 మంది రసాయన శాస్త్ర విద్యార్థుల బృందం స్థానిక భూసార పరీక్షా కేంద్రం (సాయిల్ టెస్టింగ్ ల్యాబోరేటరీ-ఎస్‌టీఎల్)లో గత పది రోజులు శిక్షణ తీసుకున్నారు. శుక్రవారం ఎస్‌టీఎల్ ఏడీఏ రోజా పుష్పలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ.. భూమి భౌతిక, రసాయన లక్షణాలు, వాటికి సంబంధించి విషయ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. పీహెచ్ (భూమి స్థితి) శాతం ఎలెక్ట్రికల్ కండక్టర్ (ఈసీ), ఆర్గానిక్ కర్బన్ (ఓసీ), నైట్రోజన్ (ఎన్), ఫాస్పరస్ (పీ), పొటాష్ (కే), సల్ఫర్, బోరాన్, ఐరన్, కాపర్, జింక్, మాంగనీస్ లాంటి స్థూలపోషకాలు (మ్యాక్రో న్యూట్రియంట్స్), అలాగే సూక్ష్మపోషకాలు (మైక్రో న్యూట్రియంట్స్) శాతం విశ్లేషించే క్రమంలో చేపట్టాల్సిన 12 రకాల పరీక్షలపై వివరించారు. కార్యక్రమంలో ఎస్‌టీఎల్ ఏవోలు శ్రీనాథరెడ్డి, నాగేంద్ర, ఆదిలక్ష్మి, రుమానాబేగం, ఉమామహేశ్వరి, అర్చన తదితరులు పాల్గొన్నారు.